క్లుప్తంగా

పెద్దమ్మ బోనాల పండుగ


ఊరేగింపుగా వస్తున్న భక్తులు

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లిలో పెద్దమ్మతల్లి ఆలయ నాలుగో వార్షికోత్సవాలు జరుగుతున్నాయి. గురువారం భక్తులు బోనాలతో ఆలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈసందర్భంగా బైండ్లోళ్ల, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన హరినామ సప్తాహం

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామ హనుమాన్ ఆలయంలో గురువారం అఖండ హరినామ సప్తాహం ప్రారంభమైంది. ఏటా గ్రామస్తులు, ఆలయ కమిటీ సామూహికంగా సప్తాహం నిర్వహిస్తారు. వారం రోజులపాటు జరిగే కార్యక్రమంలో రోజు ఉదయం కాగడ హారతి, జ్ఞానేశ్వరి పారాయణం, మధ్యాహ్నం గాతభజన, రాత్రి ప్రవచనాలు, కీర్తనలు ఆలపించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

సిగ్నల్ వ్యవస్థకు మరమ్మతులు

సాక్షి స్పందన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో రోడ్లపైనే దుకాణాల ఏర్పాటు, పనిచేయని సిగ్నళ్లతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 23న సాక్షిలో ఆక్రమణలు.. అవస్థలు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్, పోలీస్ సిబ్బంది జయశంకర్ చౌరస్తాలో సిగ్నల్ వ్యవస్థకు మరమ్మతులు చేయించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి


రోడ్లను పరిశీలిస్తున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని బర్కత్‌పూర కాలనీలో డ్రెయినేజీలు, రోడ్లను పరిశీలించారు. పారిశుధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. త్వరలోనే కాలనీలో అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. చైర్మన్ వెంట స్థానిక కౌన్సిలర్ ముజాహిద్, కాలనీవాసులు ఉన్నారు.

బాబా ఆలయంలో భక్తుల పూజలు

కుంటాల: రెండో షిర్డీగా ప్రఖ్యాతి గాంచిన మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ రైతులు సామూహిక సత్యనారాయణ వ్రతాలను ఆచరించారు. హారతి కార్యక్రమంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

వారసంత ప్రారంభం


వ్యాపారులను సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో గురువారం వీడీసీ ఆధ్వర్యంలో వారసంతను ప్రారంభించారు. మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలతోపాటు భైంసా, లోకేశ్వరం, కుంటాల, నర్సాపూర్(జి), దిలావర్‌పూర్ మండలాల ప్రజలు, వ్యాపారులు తరలివచ్చారు. ఈ సందర్భంగా రైతులను, వ్యాపారులను వీడీసీ సభ్యులు సన్మానించారు.

క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన నాయకులు


క్షతగాత్రుల వద్ద కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌టౌన్: నిర్మల్‌రూరల్ మండలం మహబూబ్ ఘాట్ సమీపంలో ముస్కాన్ ట్రావెల్స్ బస్సు బుధవారం అర్ధరాత్రి అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. దీంతో ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు అర్జుమంద్ అలీ, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జునైద్ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.

పంట కొనుగోళ్లలో జాప్యం

- కొనుగోలు కేంద్రాల్లో రైతుల పడిగాపులు
- అకాల వర్షాలు, లారీలు రాక ఇబ్బందులు పడుతున్న వైనం
- అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు


కుంటాల కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యం చూపుతున్న రైతులు

కుంటాల: వ్యయప్రయాసాలకోర్చి పంటలు పండిస్తున్న రైతులను అకాలవర్షాలు కష్టాల ఊబిలోకి నెట్టేస్తున్నాయి. మరోవైపు పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి రోజులు గడుస్తున్నా.. తూకం వేయడంలో నిర్వాహకులు జాప్యం చేస్తున్నారని కర్షకులు వాపోతున్నారు. కుంటాల మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో పంట ఉత్పత్తులు తడిసిపోయాయి. వాటిని ఆరబెడుతూ.. కుప్పచేస్తూ రైతులు నానావస్థలు పడుతున్నారు. కుప్పల వద్దే పడిగాపులు కాస్తూ.. తమ వంతు ఎప్పుడు వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.

కొనుగోళ్లలో వేగం పెంచితేనే..

కుంటాల మండలంలోని ఆయా గ్రామాల్లో యాసంగిలో 2,792 ఎకరాల్లో వరి, 2,036 ఎకరాల్లో జొన్న, 8,750 ఎకరాల్లో మొక్కజొన్న పంటలను సాగు చేశారు. మండలంలోని కల్లూర్, అందాకూర్, లింబా(కె), లింబా(బి), కుంటాల, ఓలా, అంబకంటి, పెంచికల్‌పాడ్ గ్రామాల్లో పీఏసీఎస్, డీసీఎంఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం, కల్లూర్, కుంటాల, పెంచికల్‌పాడ్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతుల సౌకర్యార్థం జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏటా అకాల వర్షాలకు పంట తడుస్తున్నా.. అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. మిల్లులకు వెళ్లిన లారీలు రెండు, మూడు రోజులు అక్కడే ఉండడంతో కొనుగోళ్లు మందకొడిగా కొనసాగుతున్నాయి. దీంతో అన్నదాతలు ధాన్యం కుప్పల వద్ద నిరీక్షిస్తున్నారు. దీనికి తోడు అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జొన్న పంట తూకం వేసి వారం రోజులు గడుస్తున్నా.. బస్తాలను తరలించడంలో జాప్యం నెలకొంటుందని రైతులు వాపోతున్నారు.

తడిసి ముద్దవుతున్న పంటలు..

చేతికొచ్చిన నామమాత్రపు దిగుబడులను అమ్ముకుందామనుకుంటే అకాల వర్షాలు కన్నీళ్లు మిగులుస్తున్నాయని కర్షకులు వాపోతున్నారు. సకాలంలో కొనుగోళ్లు జరపక, తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించకపోవడంతో అకాల వర్షాలకు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం రాశులు తడిసి ముద్దవుతున్నాయి. బుధవారం సాయంత్రం కురిసిన కాల వర్షంతో కొనుగోలు కేంద్రంతోపాటు కల్లాల వద్ద వరి, జొన్న పంట కుప్పలు తడిసిపోయాయి. వాటిని ఆరబెట్టేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇబ్బందులు కలుగకుండా చర్యలు

రైతులు అధైర్యపడొద్దు. కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించాం. లారీల కొరత లేకుండా చూసి సకాలంలో ధాన్యం మిల్లులకు తరలించి ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకుంటాం.

– నర్సయ్య, ఇన్‌చార్జి డీసీవో

ధాన్యం తడిసింది



యాసంగిలో మొక్కజొన్నతో పాటు వరి పంట సాగు చేశాను. ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చా. అకాలవర్షంతో ధాన్యం తడిసింది. ఇప్పుడు మళ్లీ ఆరబెట్టేందుకు ఇబ్బందులు పడుతున్నాం. రైతులకు కష్టాలు తప్పడం లేదు.

– చిప్పు గజానంద్, రైతు, కుంటాల

సకాలంలో తరలించాలి



ఏటా అకాల వర్షాలతో పంట దిగుబడులు తడిసిపోతున్నాయి. కుంటాలలోని జొన్నల కొనుగోలు కేంద్రానికి పంటను అమ్మేందుకు తీసుకొచ్చా. తూకం వేసిన బస్తాలను తరలించడంలో జాప్యం ఏర్పడుతుంది. తడిసిన ధాన్యాన్ని కూడా కొనాలి.

– విజయ్, రైతు, ఓలా

బుద్ధుడు చూపిన బాటలో నడవాలి


తానూరు: వందన కార్యక్రమంలో నాయకులు


నిర్మల్‌రూరల్: సోఫినగర్ బుద్ధవిహార్‌లో..


భైంసారూరల్: పెండ్‌పల్లిలో నివాళులర్పిస్తున్న బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నాయకులు

తానూరు: ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలకు దూరం ఉండి బుద్ధుడు చూపిన మార్గంలో నడవాలని భారతీయ బౌద్ధమహాసభ రాష్ట్ర నాయకులు బన్సోడే ఆనంద్‌రావ్ అన్నారు. గురువారం మండలంలోని బెంబరలో నిర్వహించిన బుద్ధజయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజు బుద్ధవిహార్‌లో వందన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం పంచరంగి జెండాను ఆవిష్కరించారు. బౌద్ధ మహాసభ నాయకులు, సూర్యకాంత్ పవార్, గంగాధర్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ బుద్ధ విహార్‌లో నిర్మల్ బుద్ధ విహార కమిటీ ఆధ్వర్యంలో బుద్ధ పూర్ణిమ(జయంతి) నిర్వహించారు. ఈసందర్భంగా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుంభోల్ల వెంకటస్వామి, మధుకర్ మునేశ్వర్ బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమం ప్రారంభించారు. పంచశీల ప్రార్థన చేశారు. కమిటీ ఉపాధ్యక్షులు రావుల గంగన్న, సంజీవ్ జాడే, గుండెరావు సాగర్, కోశాధికారి ఎలుగు రాజన్న, కార్యదర్శులు అరుణ రాణి, స్వరూపరాణి, రేఖ, సభ్యులు, డాక్టర్ ఉత్తం, జితేందర్ పాల్గొన్నారు.

భైంసారూరల్: బుద్ధుడు చూపిన మార్గంలో నడవాలని ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా భైంసా అధ్యక్షులు ప్రసంజీత్ హేమ్లే అన్నారు. గురువారం మండలంలోని పేండ్‌పల్లి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుద్ధ పూర్ణిమ నిర్వహించారు. పంచశీల్ ధమ్మ ధ్వజ్ జెండా ఎగురవేశారు. బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ శాంతియుత జీవనం కోసం పంచశీల, నాలుగు ఆర్య సత్యాలు, అష్టాంగ మార్గం, పది పారమితాలు అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో బాకొల్ల మోహన్, బాకొల్ల రాజు, రాజారెడ్డి, పవన్, రాము, భోజన్న, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు


సోన్: న్యూవెల్మల్‌లో పరిశీలిస్తున్న ఏవో, ఎస్సై


కల్లూర్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

సోన్: నకిలీ విత్తనాలు, ఎరువులను రైతులకు విక్రయిస్తే పీడీయాక్టు కేసులు నమోదు చేస్తామని ఎస్సై సంతోషం రవీందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు న్యూవెల్మల్, బొప్పారం, కూచన్‌పెల్లి గ్రామాల్లోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులను లైసెన్సు డీలర్ వద్దే కొనాలన్నారు. తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని పురుగు మందులను అధిక ధరలకు విక్రయించొద్దని దుకాణ యజమానులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ అంబాజీ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని టెక్నికల్ ఏడీఏ విద్యాసాగర్, భైంసా ఏడీఏ వీణ హెచ్చరించారు. గురువారం మండలంలోని కల్లూర్‌లో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామన్నారు. లూజు, హెచ్‌టీ విత్తనాలు విక్రయించడం నిషేధమని సూచించారు. వారి వెంట ఏవో సోమలింగారెడ్డి, ఏఈవో గణేశ్ తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి)లో..

నర్సాపూర్(జి): రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చర్యలు తప్పవని ఎస్సై హన్మాండ్లు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని రమేశ్ ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు చేశారు. ఎరువులు, విత్తనాల బస్తాలు, వాటికి సంబంధించిన రశీదులను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


కుంటాల : కల్యాణంలో పాల్గొన్న భక్తులు


లోకేశ్వరం: కిష్టాపూర్‌లో..


కుంటాల: మండలంలోని అందాకూర్ శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిపించారు. గణపతి పుణ్యాహవచనం, యజ్ఞోపవీతం, కన్యాదానం, సుముహూర్త మంగళధారణ, స్వస్తి పుణ్యాహవచనం, తీర్థప్రసాద వితరణ అనంతరం అన్నదానం చేశారు. అర్చకులు సదాశివ్, భూషణ్, కేదార్‌నాథ్, రంగయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని కిష్టాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు సంతోష్ జోషి ఆధ్వర్యంలో కల్యాణతంతు జరిపించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమం నిర్వహించి కలాణ్యం జరిపించారు.

బీరప్ప ఆలయంలో కొనసాగుతున్న పూజలు

సారంగపూర్: మండల కేంద్రం శివారులోని బీరప్ప ఆలయంలో కుర్మ,గొల్లల ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. గురువారం బీరప్ప కల్యాణం అనంతరం నాగవెల్లి సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో బీరప్ప దేవుడి చరిత్రను కథ రూపంలో కళాకారుల బృందం వివరించారు. అనంతరం దేవుడి ప్రతిమను వీధుల్లో ఊరేగించారు. వేడుక తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు.

శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న విశ్వకర్మ సంఘ సభ్యులు

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం శ్రీ గోవిందమాంబ–వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. స్వామివారి పల్లకిని విశ్వకర్మ సంఘ సభ్యులు డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అర్చకుడు మొనాజీ శాస్త్రీ, సంఘం సభ్యులు మురళి, ఉదయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, జగన్, రాజేందర్, సంతోష్, సత్తయ్య, అశోక్, నాంపల్లి గజేందర్, రమేశ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యపరీక్షలు


పార్‌పెల్లిలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

లక్ష్మణచాంద: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రాల ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యురాలు ప్రత్యూష తెలిపారు. గురువారం మండలంలోని పార్‌పెల్లి, మల్లాపూర్, వడ్యాల్, బోరిగాం ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ఎన్‌సీడీఎస్ కార్యక్రమంలో భాగంగా మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్న వారిని గుర్తిస్తూ 30 ఏళ్లు పై బడిన వారికి వైద్యపరీక్షలు చేశారు. ఆహారపు అలవాట్లు, ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురికి మందులు అందజేశారు. సిబ్బంది శివకృష్ణ, గంగామణి, సుగుణ, యాస్మిన్ ఉన్నారు.

మున్సిపాలిటీకి చెడ్డపేరు తేవొద్దు

- భైంసా మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్


మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్

భైంసాటౌన్: భైంసా మున్సిపాలిటీకి చెడ్డ పేరు తెచ్చేలా అధికారులు, ఉద్యోగులు వ్యవహరించొద్దని వైస్‌చైర్మన్ ఎండీ.జాబీర్‌అహ్మద్ సూచించారు. కమిషనర్ వెంకటేశ్వర్‌రావు, బిల్ కలెక్టర్ విద్యాసాగర్ బుధవారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. కమిషనర్ బిల్ కలెక్టర్ విద్యాసాగర్, శానిటేషన్ జవాన్ చారి సహకారంతో అక్రమాలకు పాల్పడినట్లు తెలిసిందన్నారు. శానిటేషన్ జవాన్ చారి సహకారంతో పట్టణంలో నూతన భవన నిర్మాణాల గురించి తెలుసుకోవడం, మున్సిపల్ పాలకవర్గానికి తెలియకుండా నోటీసులు జారీ చేసి బెదిరింపులకు పాల్పడేవారని తెలిపారు. ఇందులో భాగంగానే రాధేశ్యాం నుంచి రూ.30 వేలు లంచం డిమాండ్ చేయడంతో ఆయన ఏసీబీని ఆశ్రయించారన్నారు. సదరు నోటీసులు సైతం మున్సిపల్ కార్యాలయంలో టైప్ చేయించకుండా, బయట నుంచే ఈ తతంగం నడిపినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న ఐదుగురు రెగ్యులర్ ఉద్యోగులు విధులకు హాజరు కాకున్నా రిజిస్టర్‌లో హాజరు నమోదు చేసి వేతనం పొందేలా కమిషనర్ సహకరించారని, తద్వారా వారి నుంచి లబ్ధి పొందినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ మేరకు సదరు జవాన్‌ను విధుల నుంచి తప్పించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. విధులకు రాకున్నా వేతనం పొందిన వారి హాజరు వివరాలను కలెక్టర్‌కు వివరిస్తామన్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే తన దృష్టికి తేవాలని సూచించారు.

ఉపాధి కల్పనకే టైలరింగ్ కేంద్రాలు

- డీఆర్డీవో విజయలక్ష్మి


కుట్టుమిషన్లు పరిశీలిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

లోకేశ్వరం: మహిళలకు ఉపాధి కల్పించేందుకే ప్రభుత్వం మహిళా శక్తి టైలరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మహిళా శక్తి టైలరింగ్ కేంద్రాన్ని డీఆర్డీవో ప్రారంభించి మాట్లాడారు. త్వరలో మండలంలోని గడ్‌చాంద, మన్మద్ గ్రామాల్లో మహిళా శక్తి టైలరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. టైలరింగ్ కేంద్రాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 3250 మందికి ఏకరూప దుస్తులు కుట్టాలన్నారు. ఒక జత కుడితే ప్రభుత్వం రూ.50 చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఎంఈవో చంద్రకాంత్, డీపీఎం సాయిప్రసాద్, ఏపీవో జగన్నాథ్, ఏపీఎం మల్లేశ్, టీఏలు రవీందర్, మంజుల, శారద, ఐకేపీ సభ్యులు ఉన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

ఖానాపూర్: గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఖానాపూర్, పెంబి మండలాల పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నుల వసూళ్లను పూర్తి చేసి మొండి బకాయిలకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సెగ్రిగేషన్ షెడ్లలో కంపోస్ట్ ఎరువులు తయారు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు డ్రెయినేజీల్లో పూడిక తీయించి వీధి దీపాలు అన్ని చోట్ల ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో రమేశ్, ఎంపీడీవో సునీత, ఎంపీవోలు చంద్రశేఖర్, రత్నాకర్‌రావు ఉన్నారు.

మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలి

పెంబి: గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని మందపల్లి, వేణునగర్ గ్రామాలలో పర్యటించారు. నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామం, శానిటేషన్ పనులను పరిశీలించారు. డ్రెయినేజీల్లో పూడికలు తొలగించి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో రత్నాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శి సుజాత, సిబ్బంది ఉన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

సారంగపూర్: మండలంలోని జామ్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2007–08లో పదోతరగతి చదివిన విద్యార్థులు గురువారం సారంగాపూర్ సమీపంలోని కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలను తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను తలుచుకుంటూ సందడిగా గడిపారు. తమతో చదువుకున్న నందిని ఇటీవల మృతి చెందడంతో రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, చంద్రశేఖర్, భోజన్నను పూర్వవిద్యార్థులు సత్కరించారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్‌టౌన్: హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివయ్య డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయంలో ఏడీని కలిసి చర్చించారు. జిల్లాలో మత్స్యకారులైన ముదిరాజ్‌లకు, గంగపుత్రులకు మధ్య నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్ మత్స్యకారులకు సంబంధించిన 26 కేసుల అంశాలపై సమస్యను పరిష్కరించాలని హైకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ జక్కుల నాగరాజు, కీర్తి రవీందర్, కొమురయ్య, భీమేశ్ ఉన్నారు.

'జిల్లాల రద్దు ఆలోచన సరికాదు'


మాట్లాడుతున్న జగన్మోహన్

నిర్మల్‌టౌన్: పాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన జిల్లాలను సీఎం రేవంత్‌రెడ్డి రద్దు చేస్తాననడం సరికాదని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి జగన్మోహన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో మాట్లాడారు. చిన్న రాష్ట్రాలు, చిన్న జిల్లాలతో సుపరిపాలన జరిగి వేగంగా అభివృద్ధి జరుగుతుందనే అంబేద్కర్ మాటలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాజేశ్వర్, మహిళా కన్వీనర్ లక్ష్మి, సాగర్, రాధిక తదితరులు ఉన్నారు.